
సాక్షి
కామారెడ్డి
సోమవారం । 6 । మార్చి । 2023



ఆగని చోరీలు

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను లక్ష్యంగా చేసుకుని దొంగలు రెచ్చిపోతున్నారు. వాటిని ధ్వంసం చేసి ఆయిల్, కాపర్‌వైర్ ఎత్తుకెళ్తున్నారు.

- 8లో ▸



చదువు సాగేదెలా?

ప్రభుత్వ పాఠశాలలను ఉపాధ్యాయుల కొరత వేధిస్తోంది. పరీక్షలు సమీపిస్తున్నా చాలాచోట్ల సిలబస్ పూర్తికాలేదు.

- 10లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
37.6 /13.9

వాతావరణం

ఉదయం నుంచే ఎండ తీవ్రత పెరుగుతుంది. ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది. చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

'మన ఓటు' పుస్తకానికి ఎన్నికల సంఘం గుర్తింపు

కామారెడ్డి అర్బన్: కామారెడ్డికి చెందిన రచయిత సిరిగాద శంకర్ రాసిన 'మన ఓటు' పుస్తకానికి భారత ఎన్నికల సంఘం గుర్తింపు లభించింది. ఈ విషయాన్ని పుస్తక రచయితే 'సాక్షి'తో తెలిపారు. ఓటు, ఓటరు దినోత్సవం, రాజకీయ పార్టీలు, తిరుగుబాటు అభ్యర్థి, బీ ఫారం, నోటా, ఓటు ఎందుకు వేయాలి అనే అంశాలపై ఓటర్లను చైతన్యం చేసేందుకు ఈ పుస్తకాన్ని రాశానని పేర్కొన్నారు. దీనిని ఇంగ్లీష్ భాషలోకి అనువాదం చేసి దేశం అంతటా అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఎన్నికల సంఘం సమాచారం ఇచ్చిందని తెలిపారు.

ప్రశాంతంగా గురుకులాల ప్రవేశ పరీక్ష

డిచ్‌పల్లి: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ప్రతిభా కళాశాలల్లో 2023–24 విద్యా సంవత్సరానికిగానూ ఇంటర్మీడియట్‌లో అడ్మిషన్ కోసం ఆదివారం నిర్వహించిన సీవోఈ సెట్- 2023 ప్రశాంతంగా జరిగినట్లు సంస్థ నిజామాబాద్ రీజినల్ కోఆర్డినేటర్ (ఆర్‌సీవో) మేరి యేసుపాదం, జిల్లా కోఆర్డినేటర్ (డీసీవో) బి.సంగీత తెలిపారు. నిజామాబాద్ రీజియన్ పరిధిలో ఏర్పాటు చేసిన 16 పరీక్షా కేంద్రాల్లో ప్రవేశ పరీక్ష నిర్వహించామన్నారు. నిజామాబాద్ జిల్లాలోని 5 పరీక్షా కేంద్రాల్లో 1,023 మంది బాలురు, 1,704 మంది బాలికలు మొత్తం 2,727 మంది పరీక్షకు హాజరైనట్లు తెలిపారు. కామారెడ్డి జిల్లాలో 7 పరీక్షా కేంద్రాల్లో 988 మంది బాలురు, 1,330 మంది బాలికలు మొత్తం 2,318 మంది హాజరు కాగా, నిర్మల్ జిల్లాలోని 4 పరీక్షా కేంద్రాల్లో 784 మంది బాలురు, 1,434 మంది బాలికలు మొత్తం 2218 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు వారు తెలిపారు. నిజామాబాద్ రీజియన్ పరిధిలో 92.85 శాతం విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు తెలిపారు.

గురుకులాల డిగ్రీ ప్రవేశ పరీక్ష..



డిచ్‌పల్లి: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలల్లో 2023–24 విద్యా సంవత్సరానికి గానూ డిగ్రీ ఫస్టియర్‌లో అడ్మిషన్ల కోసం ఆదివారం నిర్వహించిన టీజీయూజీసెట్ -2023 ప్రశాంతంగా జరిగినట్లు ఆర్‌సీవో మేరి యేసుపాదం, డీసీవో బి.సంగీత తెలిపారు. నిజామాబాద్ రీజియన్ పరిధిలో ఏర్పాటు చేసిన 6 పరీక్షా కేంద్రాల్లో టీజీయూజీసెట్ నిర్వహించినట్లు తెలిపారు. ఈ ప్రవేశ పరీక్షకు మొత్తం 2,670 మంది విద్యార్థులకు గానూ 2,448 మంది హాజరైనట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాలను ఆర్‌సీవో, డీసీవో తనిఖీ చేశారు.

పర్యాటక కేంద్రంగా మెట్ల బావి



లింగంపేట: మండల కేంద్రం సమీపంలోని జక్సాని నాగన్నగారి మెట్ల బావిలో పూడికతీత పనులు కొనసాగుతున్నాయి. ఇందుకోసం కలెక్టర్ జితేష్ వి పాటిల్ నిధులు మంజూరు చేసినట్లు సర్పంచ్ బొల్లు లావణ్య తెలిపారు. బావిని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు పనులు వేగవంతం చేశామని పేర్కొన్నారు.

బ్యాంకు మేనేజర్‌కు ఎయిర్‌గన్‌తో బెదిరింపు?

వేల్పూర్: వేల్పూర్ మండలం అంక్సాపూర్ యూనియన్ బ్యాంకు మేనేజర్ అవినాష్‌ను మండలంలోని పోచంపల్లి సర్పంచ్ దేశ్‌పాండే అనంతరావు ఎయిర్‌గన్‌తో బెదిరించినట్లు మేనేజర్ భార్య చెప్పిన విషయాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. బ్యాంకు ద్వారా ఇప్పించే లోన్‌లు, వాటి రికవరీ విషయంలో చూసీచూడనట్లుగా ఉండాలని సర్పంచ్ కోరగా, అందుకు మేనేజరు ససేమిరా అనడంతో శుక్రవారం బ్యాంకులో బెదిరించినట్లు సమాచారం. బ్యాంకులో మరమ్మతుల కారణంగా సీసీ ఫుటేజీలు లేకపోవడంతో ఈ వ్యవహారం రికార్డు కానట్లు తెలుస్తోంది. సర్పంచ్ బెదిరింపును మేనేజరు తమ ఉన్నతాధికారులకు విన్నవించినట్లు సమాచారం. ఆదివారం అంక్సాపూర్ వీడీసీ వద్ద మేనేజరు కుటుంబం తమగోడు వెల్లబోసుకున్నట్లు తెలిసింది. దీనిపై తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని వేల్పూర్ పోలీసులు తెలిపారు.

'కస్తూర్బా' వెలుగులు..

- విద్యార్థినుల భవితకు బాటలు వేస్తున్న కేజీబీవీలు
- పలు రంగాల్లో రాణిస్తున్న పేదింటి బిడ్డలు

పేదరికం కారణంగా విద్యార్థినులు చదువుకు దూరం కాకూడదన్న ఉద్దేశంతో సర్కారు ఏర్పాటు చేసిన కేజీబీవీలు.. బాలికల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయి. ఈ విద్యాలయాల్లో చదువుకున్న ఎందరో పేదింటి బిడ్డలు ఉన్నత స్థానాలకు చేరి ఆదర్శంగా నిలుస్తున్నారు. ఈనెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం నేపథ్యంలో కస్తూర్బాల్లో చదివిన పలువురు విద్యార్థినుల సక్సెస్ స్టోరీ..



సాక్షి, కామారెడ్డి: చదువుకునే స్థోమత లేక కొందరు.. ఉన్న ఊళ్లో ఉన్నత పాఠశాలలు లేక ఇంకొందరు.. ఉన్నత విద్యకు దూరమయ్యే పరిస్థితులు ఉండేవి. అలాంటి వారి భవితకు బంగారు బాటలు వేసేందుకు ప్రభుత్వం 2014లో 'కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు' ప్రారంభించింది. జిల్లాలో 19 కేజీబీవీలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం పది స్కూళ్లలో ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు, తొమ్మిది స్కూళ్లలో ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యనందిస్తున్నారు. జిల్లాలోని కేజీబీవీల్లో దాదాపు ఐదు వేల మంది విద్యార్థులున్నారు. ఇందులో చాలామంది మారుమూల గ్రామాలకు చెందిన పేద విద్యార్థినులే.. ప్రభుత్వం మౌలిక వసతులు కల్పించి, నాణ్యమైన విద్య అందిస్తున్నారు. విద్యార్థులు చదువుతో పాటు ఆట, పాటల్లోనూ ముందుండేలా ఉపాధ్యాయులు చూస్తున్నారు. ఉన్నత లక్ష్యాలు ఏర్పరచుకుని అందుకు అనుగుణంగా కష్టిస్తుండడంతో విద్యార్థినులు విజయాలు సాధిస్తున్నారు. దీంతో కస్తూర్బాల్లో చదివిన విద్యార్థులెందరో మంచి అవకాశాలను సొంతం చేసుకుంటున్నారు.

సాఫ్ట్‌వేర్ ట్రెయినీగా ప్రణీత..



దోమకొండ మండల కేంద్రంలోని పలుగుగడ్డ ప్రాంతానికి చెందిన ప్రణీత టేక్రియాల్ కేజీబీవీలో ఎనిమిదో తరగతి నుంచి పదో తరగతి వరకు చదివింది. ఇంటర్ తర్వాత బీటెక్ చేసింది. ప్రస్తుతం సాఫ్ట్‌వేర్ ట్రెయినీగా పని చేస్తోంది. తమ కూతురు ఉన్నత స్థానానికి చేరుకోవడంతో ప్రణీత తల్లిదండ్రులు ఎంతగానో ఆనందిస్తున్నారు.

ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌గా స్రవంతి..



మాచారెడ్డి మండలం సోమారంపేట తండాకు చెందిన బదావత్ స్రవంతి తల్లిదండ్రులు రాములు, లచ్చిమి వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఆమె ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు లింగంపేటలోని కేజీబీవీలో చదివింది. చదువుతోపాటు యాంకరింగ్ చేస్తూ అందరి అభినందనలు అందుకుంది. చదువు అనంతరం ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఉద్యోగం సాధించింది. తాను ఈ స్థాయికి చేరడానికి కస్తూర్బాలో టీచర్లు అందించిన ప్రోత్సాహమే కారణమని చెబుతోంది స్రవంతి.

విద్యార్థినుల ఉన్నతికి బాటలు..



గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో సామాజికంగా వెనుకబడిన వర్గాలు, దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాల్లోని ఆడపిల్లలు చాలామంది చదువులు మధ్యలో మానేస్తున్నారు. వారి కోసమే ప్రభుత్వం కస్తూర్బా పాఠశాలలు ప్రారంభించింది. కేజీబీవీల్లో విద్యార్థులకు మంచి విద్య అందుతోంది. దీంతో వేలాది మంది విద్యార్థినులు ఉన్నతంగా ఎదిగారు. ఇంజినీర్లుగా, డాక్టర్లుగా, ప్రభుత్వ ఉద్యోగులుగా, ఇతర రంగాల్లోనూ స్థిరపడ్డారు. ఎస్పీడీ, ఏఎస్పీడీ, కలెక్టర్, డీఈవోల నిరంతర పర్యవేక్షణ, బోధనా సిబ్బంది సమష్టి కృషితో విద్యార్థినుల ఉన్నతికి బాటలు పడుతున్నాయి.

– ఉమారాణి, జీఈసీవో, కామారెడ్డి

ఫిజియోథెరపిస్ట్‌గా లత..



లింగంపేట మండలానికి చెందిన బోడ లతది వ్యవసాయ కుటుంబం. తల్లిదండ్రులు ఫంగిబాయి, లక్ష్మణ్‌లు వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఆమె లింగంపేట కస్తూర్బాలో చదివింది. కన్నవారి కలలను నిజం చేయడానికి లత కష్టపడింది. పదో తరగతిలో 9.2 జీపీఏ సాధించింది. కామారెడ్డిలోని శ్రీసాందీపని కాలేజీలో ఇంటర్ చదివింది. బ్యాచ్‌లర్ ఆఫ్ ఫిజియోథెరపీ సీటు సాధించింది. ప్రస్తుతం ఆమె హైదరాబాద్‌లో ఫిజియోథెరపిస్టుగా ఉద్యోగం చేస్తోంది. కేజీబీవీలో అందిన నాణ్యమైన విద్య వల్లే తాను ఈ స్థాయికి చేరుకున్నానని చెబుతోంది లత.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగంలో నిర్మల..



నాగిరెడ్డిపేట మండలంలోని మారుమూల గ్రామమైన జానకంపల్లికి చెందిన నిర్మలది పేద కుటుంబం. ఆమె తల్లిదండ్రులు నౌసియా, ధర్మి వ్యవసాయం చేస్తారు. నిర్మల ఐదో తరగతి వరకు సమీప పాఠశాలలో చదివింది. ఆరో తరగతిలో నాగిరెడ్డిపేట కేజీబీవీలో చేరింది. పదో తరగతిలో 10 జీపీఏ సాధించింది. దీంతో బాసర ట్రిపుల్ ఐటీలో సీటు వచ్చింది. ఇంజినీరింగ్ పూర్తి చేసిన నిర్మల ప్రస్తుతం సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తోంది. తన ఉన్నతికి కేజీబీవీనే కారణమని నిర్మల గర్వంగా చెబుతోంది.

మెడిసిన్ సీటు సాధించిన స్వర్ణ..



లింగంపేట మండలం పర్మల్లకు చెందిన మునావత్ స్వర్ణ తల్లిదండ్రులు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. అందుబాటులో పాఠశాల లేకపోవడంతో ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు లింగంపేట మండల కేంద్రంలోని కేజీబీవీలో చదివించారు. పదో తరగతిలో 9.3 జీపీఏ సాధించిన స్వర్ణ.. ఇంటర్ బైపీసీలోనూ మంచి మార్కులు సాధించింది. మెడిసిన్ చదవాలన్న లక్ష్యంతో నీట్ రాయగా మొదట బీడీఎస్‌లో సీటు వచ్చింది. దానిని వదులుకుని కోచింగ్ తీసుకుంది. మరుసటి ఏడాది నీట్ రాయగా.. నల్గొండలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలో సీటు వచ్చింది. ప్రస్తుతం ఎంబీబీఎస్ మూడో సంవత్సరం చదువుతోంది. తన ఉన్నతికి కస్తూర్బానే కారణమని స్వర్ణ చెబుతోంది.

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా శిల్ప..



బాన్సువాడ మండలం హన్మాజీపేటకు చెందిన పర్శ శిల్ప ఎనిమిదో తరగతిలో బాన్సువాడలోని కేజీబీవీలో చేరింది. పదో తరగతిలో 9.5 జీపీఏ సాధించింది. తరువాత జవహర్ నవోదయలో ఎంపీసీఎస్‌లో చేరింది. ఎంసెట్‌లో మంచి ర్యాంక్ సాధించడంతో చైతన్య టెక్నికల్ క్యాంపస్‌లో చేరి ఇంజినీరింగ్ పూర్తి చేసి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం సాధించింది. తన ఎదుగుదలకు కస్తూర్బాలోనే బాటలు పడ్డాయని చెబుతోంది శిల్ప.

పోస్టల్ ఉద్యోగం సాధించిన సంధ్య



మాచారెడ్డి మండలం సోమారంపేట తండాకు చెందిన సంధ్యదీ వ్యవసాయ కుటుంబమే. ఆమె తల్లిదండ్రులు రాజు, జక్కి వ్యవసాయం చేస్తారు. సంధ్య ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు మాచారెడ్డిలోని మినీ గురుకులంలో చదివింది. మాచారెడ్డి కేజీబీవీలో ఆరో తరగతిలో చేరింది. పదో తరగతిలో 9.5 జీపీఏ సాధించిన సంధ్య.. అసిస్టెంట్ బ్రాంచ్ పోస్టు మాస్టర్ ఉద్యోగం సాధించి కుటుంబానికి ఆసరా ఉంటోంది.

డ్రాపవుట్ అయినా ఉద్యోగం సాధించిన బాలమణి..



జుక్కల్‌కు చెందిన హనుమండ్లు, రామవ్వల కూతురు బాలమణి చదువు మధ్యలో మానేసి ఇంటి పనులు, వ్యవసాయ పనులు చేసేది. తరువాత జుక్కల్‌లోని కస్తూర్బాలో ఎనిమిదో తరగతిలో చేరింది. కష్టపడి చదివి పదోతరగతి ఉత్తీర్ణత సాధించింది. పోటీ పరీక్షలు రాసి వీఆర్‌ఏ ఉద్యోగం సాధించింది. డ్రాపవుట్ అయి తిరిగి చదుకుని ఉద్యోగం సాధించిన బాలమణి ఎందరికో ఆదర్శంగా నిలుస్తోంది.

బీపీఎం ఉద్యోగం సాధించిన అమీనా..



ఎల్లారెడ్డికి చెందిన కర్రోత్ అమీనా తల్లిదండ్రులు సంత్యాలి, లాల్‌సింగ్ వ్యవసాయం చేస్తారు. అమీనా ఎల్లారెడ్డి కేజీబీవీలో ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుకుంది. బాన్సువాడలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్ పూర్తి చేసింది. ఎంసెట్ రాసి ఇంజినీరింగ్‌లో ఈసీఈ గ్రూపులో సీటు సాధించింది. బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్నప్పుడే పోస్టల్ డిపార్టుమెంట్‌లో జీడీఎస్ బీపీఎం ఉద్యోగం వచ్చింది. మధ్యప్రదేశ్‌లో ఉద్యోగం చేసిన ఆమె.. ఇటీవలే బదిలీపై తెలంగాణకు వచ్చింది.

బీజేపీ పాలన కోసం ప్రజల ఎదురుచూపు

నిజాంసాగర్: రాష్ట్రంలో బీజేపీ పాలన కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారని ఆ పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆలె భాస్కర్ పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాలనకు ఆకర్షితులైన బీజేపీలో చేరుతున్నారన్నారు. ఆదివారం బిచ్కుంద మండలం బండ రెంజల్‌లో బీజేపీ స్ట్రీట్ కార్నర్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో కేసీఆర్ కుటుంబ పాలనతో ప్రజల సమస్యలకు పరిష్కారం లభించడం లేదన్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార, నాయకులు రాములు సేట్ తదితరులు పాల్గొన్నారు.



బీజేపీలో చేరినవారితో పార్టీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార, ఆలె భాస్కర్

'యోగాతో ఆనందమయ జీవితం'


కామారెడ్డి అర్బన్: జీవితం ఆనందమయం కావడానికి యోగా, ధ్యానం, సంగీతం ఎంతగానో తోడ్పడతాయని అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే పేర్కొన్నారు. కామారెడ్డి స్నేహపురి కాలనీలో ఆదివారం ఎస్ఎస్‌వై యోగా కేంద్రం వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా, ధ్యానం, సంగీతం భారతీయ సంస్కృతిలో ఒక భాగమన్నారు. ఖర్చులేని ఆరోగ్య జీవన విధానాన్ని ప్రతిఒక్కరు అవలంబించి సంతోషంగా ఉండాలన్నారు. జనాభాలో 65 శాతం ఉన్న యువతను యోగా, ధ్యానంవైపు మళ్లిస్తే ఉత్తమ సమాజం నిర్మాణమవుతుందన్నారు. తాను క్రమం తప్పకుండా యోగా చేస్తానన్నారు. కామారెడ్డి పట్టణంలో ఇంటింటికి యోగాను తీసుకువెళ్లాలని వీటీ ఠాకూర్ స్మారక ట్రస్టు చైర్మన్ వీటీలాల్ సూచించారు. సమావేశంలో యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గడ్డం రాంరెడ్డి, యోగాచార్యులు గరపల్లి అంజయ్యగుప్తా, వార్డు కౌన్సిలర్ ఎ.నరేందర్, సహయోగాచార్యులు అంతిరెడ్డి, కాసర్ల రామచంద్రం, పి.అంజయ్య, ప్రతినిధులు బి.రఘుకుమార్, అనిల్‌రెడ్డి, కే.సిద్ధాగౌడ్, ఎల్లయ్య, లక్ష్మణ్‌రావు, కే.భైరయ్య, పీర్‌లాల్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

'ఆప్షన్' లేక అవస్థలు

- నాలుగేళ్లుగా చాలా ధరణి ఆప్షన్‌లు బంద్
- ఇంకా డమ్మీ ఖాతాల్లోనే రైతుల భూములు
- మాడ్యూల్స్ ఇవ్వడంలో ప్రభుత్వ నిర్లక్ష్యం
- ఇబ్బంది పడుతున్న బాధిత రైతులు



కామారెడ్డి క్రైం: ధరణి వెబ్‌సైట్‌లో కొన్ని ఆప్షన్లు పని చేయక రైతులు అనేక అవస్థలు పడుతున్నారు. అన్ని రకాల మాడ్యూల్స్ ఇంకా ఇవ్వకపోవడంతో వేల సంఖ్యలో రైతుల భూములకు చెందిన రికార్డులు డమ్మీ ఖాతాల్లోనే పడి ఉన్నాయి. వాటిని సరిచేసుకోవడం కోసం ధరణి వచ్చిననాటి నుంచి రైతులు చెప్పులరిగేలా కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. అయినా సమస్యల పరిష్కారం దిశగా ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం రైతాంగాన్ని ఇబ్బందులకు గురిచేస్తోంది. ధరణిలో మాడ్యూల్స్‌ను ఎప్పుడు బాగు చేస్తారో అధికారులు సైతం స్పష్టత ఇవ్వక, ఏళ్లు గడుస్తున్నా తమ భూముల సమస్యలు పరిష్కారం కాక అనేక మంది రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

జిల్లాల నుంచి నివేదించినా..

ధరణి వెబ్‌సైట్‌లో పనిచేయకుండా ఉన్న ఆప్షన్ల విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరిపై విమర్శలు పెరుగుతున్నాయి. ఏడాది క్రితం రాష్ట్ర ప్రభుత్వం దిద్దుబాటు చర్యలకు పూనుకుంది. భూ పరిపాలనా విభాగం నుంచి జిల్లాల వారీగా పెండింగ్‌లో పడి ఉన్న డమ్మీ ఖాతాల వివరాలను వెంటనే సమర్పించాలని ఆదేశాలు వచ్చాయి. వివరాలు సిద్ధంగా ఉండడంతో ఆదేశాలు వచ్చిన మరుసటి రోజే(ఏడాది క్రితం) జిల్లా అధికారులు డమ్మీ ఖాతాల వివరాలను రాష్ట్రస్థాయి అధికారులకు పంపించారు. దీంతో రైతుల్లో ఆశలు పెరిగాయి. ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలకు పరిష్కారం దొరుకుతుందేమోనని భావించారు. కానీ ఏడాది గడుస్తున్నా ప్రభుత్వం నుంచి చర్యలు లేవు. దీంతో రైతుల భూసమస్యలు ఎక్కడికక్కడే పడి ఉన్నాయి.

ఏళ్లుగా డమ్మీ ఖాతాల్లోనే..

రాష్ట్ర ప్రభుత్వం నాలుగేళ్ల క్రితం రికార్డుల ప్రక్షాళన చేపట్టింది. దీంతో కొందరికి మేలు జరిగితే వేల సంఖ్యలో రైతులకు మాత్రం కష్టాలే ఎదురయ్యాయి. ప్రక్షాళన సమయంలో దొర్లిన తప్పిదాలు ఇప్పటికీ సరిచేయక రైతుల పాలిట శాపాలుగా మారాయి. రికార్డుల ప్రక్షాళన జరిపినప్పుడు అనేక మంది రైతులు స్థానికంగా లేకనో, అవగాహన లోపం కారణంగా, వారసత్వం కింద భూములు మార్చుకోక, ఇతర అనేక కారణాలతో కొత్తగా ఇచ్చిన డిజిటల్ పాసు పుస్తకాలను పొందలేకపోయారు. మరికొంత మంది రైతులకు వచ్చిన కొత్త పాసుపుస్తకాలు, ఆన్‌లైన్ రికార్డుల్లో తప్పిదాలు దొర్లాయి. సర్వే నంబర్లు, విస్తీర్ణం, పేర్లు, భూమి రకం తదితర అనేక తప్పులు వచ్చాయి. వాటిని సరిచేసేందుకు ధరణిలో మాడ్యూల్స్ అందుబాటులో లేవు. దీంతో మూడేళ్లయినా అనేక భూసమస్యలు, రికార్డుల పునరుద్ధరణలు పెండింగ్‌లోనే ఉన్నాయి. అవే కాకుండా గ్రామానికో డమ్మీ ఖాతాను (5000, 9999, 100000ల పేరు మీద) తయారు చేసి అన్ని సర్వే నంబర్లలో మిగిలిన భూమిని అందులో వేశారు. ఉదాహరణకు తాతలు, తండ్రుల భూమిని వారసులు తమ పేరిట చేయించుకోవాలంటే డమ్మీ ఖాతా తెరుచుకోవడం తప్ప మరో అవకాశం లేదు.

నాలుగేళ్లుగా ఎదురుచూపులే..

మూడేళ్లుగా ఆప్షన్లు లేక డమ్మీ ఖాతాల్లోని భూములు అలాగే పడి ఉన్నాయి. నిత్యం రైతులు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుతున్నా పరిష్కారాలు దొరకడం లేదు. ప్రజావాణికి వచ్చే ఫిర్యాదుల్లో దాదాపు 80శాతం భూసంబంధిత సమస్యలకు సంబంధించినవే ఉంటున్నాయి. జిల్లాస్థాయిలోని అధికారులు సైతం తాము చేసేది ఏమీ లేదంటున్నారు. ప్రభుత్వం ఇకనైనా దృష్టి సారించి మాడ్యూల్స్‌ను విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు.

నాలుగేళ్లుగా తిరుగుతున్నా



నాలుగేళ్ల క్రితం కొత్తగా వచ్చిన డిజిటల్ పాస్‌బుక్‌లో ఎనిమిదిన్నర గుంటల భూమి తక్కువగా వచ్చింది. అప్పటి నుంచి కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నా. పరిష్కారం ఏమిటో కూడా అధికారులు సరిగా చెప్పడం లేదు. మాది సొంత పట్టా భూమి. దయచేసి పరిష్కరించాలి.

– పెద్ద వీరప్ప, రైతు, బీర్కూర్

ఆన్‌లైన్‌లో భూమి కనిపిస్తలేదు



నాలుగేళ్ల క్రితం కొత్త పాస్‌బుక్ వచ్చింది. అందులో అర గుంట భూమి ఎక్కువగా రావడంతో అధికారులు పిలిపించి పాస్‌బుక్ తిరిగి తీసుకుని సరిచేశారు. కానీ ఆ తర్వాత ఆన్‌లైన్‌లో నా పేరిట భూమి కనిపించడం లేదు. గుర్తుతెలియని వ్యక్తి పేరిట చూపిస్తుంది. ఎన్ని అధికారులకు విన్నవించినా ఆప్షన్ లేదంటున్నారు.

– వడ్ల లక్ష్మి, రెడ్డిపేట, రామారెడ్డి మండలం

ఆప్షన్లు రాగానే పరిష్కరిస్తాం



గ్రామానికో డమ్మీ ఖాతా ఉంటుంది. డమ్మీ ఖాతాల వివరాలు ఇదివరకే ప్రభుత్వానికి నివేదించాం. మాడ్యూల్స్ కొన్ని ఇందుబాటులో లేవు. మాడ్యూల్స్ వస్తే ప్రభుత్వ ఆదేశాలు, మార్గదర్శకాల ప్రకారం సమస్యలను పరిష్కరిస్తాం.

–రవీందర్, కలెక్టరేట్ పాలనాధికారి, కామారెడ్డి

క్లుప్తంగా

చిన్నారిని కరిచిన కుక్క



పెద్దకొడప్‌గల్‌: ఇంట్లో ఆడుకుంటున్న పసి పాపను కుక్క కరిచింది. ఆదివారం మండల కేంద్రంలోని తండాలో ఆడుకుంటున్న మీనాక్షి అనే ఏడాది చిన్నారిని కుక్క కరిచింది. ఆమెను కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, చికిత్స చేయించారు.

పెద్దశక్కర్గ వాసికి జ్యోతిష్యరత్న అవార్డు



మద్నూర్‌: మండలంలోని పెద్దశక్కర్గ గ్రామానికి చెందిన శ్రీ జంగమ రామేశ్వర స్వామికి ఆదివారం హైదరాబాద్‌లోని హరిహర కళాభవన్‌లో జ్యోతిష్యరత్న అవార్డు, సువర్ణ కంకణం అందుకున్నారు. సర్‌ సీవీ రామన్‌ అకాడమీ (సేవా) సాంస్కృతిక సంస్థ, శ్రీ కృష్ణ సేవా సంస్థాన్‌ సంయుక్తంగా ఆదివారం సికింద్రాబాద్‌లోని కళాభవన్‌లో విద్యా, వైద్య, వైజ్ఞానిక, సామాజిక, సాంస్కృతిక, చారిత్రక, లలిత కళలు, పలు రంగాలలో నిష్ణాతులను ఎంపిక చేసి వారి అవార్డులను అందించారు. పెద్దశక్కర్గకు చెందిన పురోహితుడు జంగమ రామేశ్వర స్వామి ఎంపిక కావడంతో ఆయనకు కృష్ణ చాముండేశ్వరీ మహర్షి, నటుడు సుమన్‌ తదితరులు అవార్డు అందించారు.

మహిళను కాపాడిన పోలీసులు

ఖలీల్‌వాడి: తన పిల్లలతో కలిసి ఆత్మహత్య చేసుకోడానికి వచ్చిన మహిళను పోలీసులు కాపాడారు. నగరంలోని ఆరో టౌన్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని అశోక్‌ సాగర్‌కు బోధన్‌ చెందిన హాబీబ్‌హుస్సేనా తన ఇద్దరి పిల్లలతో కలిసి వచ్చింది. అశోక్‌సాగర్‌లో దూకడానికి యత్నించగా పోలీసులు రక్షించారు. ఆమె కుటుంబ సభ్యులను పిలిపించి కౌన్సెలింగ్‌ ఇచ్చి పంపించినట్లు ఎస్సై సాయికుమార్‌ తెలిపారు.

ఉత్తమ సర్పంచ్ అవార్డుకు ఎంపిక



డిచ్‌పల్లి: మండలంలోని సుద్దపల్లి సర్పంచ్‌ పానుగంటి రూప సతీష్‌రెడ్డిని ఉత్తమ సర్పంచ్‌ నేషనల్‌ అవార్డు 2023 కు ఎంపిక చేసినట్లు బహుజన సాహిత్య అకాడమీ (బీఎస్‌ఏ) జాతీయ అవార్డు కమిటీ ప్రకటించింది. ఆదివారం బీఎస్‌ఏ జాతీయ అధ్యక్షుడు, అవార్డు సెలెక్షన్‌ కమిటీ నేషనల్‌ చైర్మన్‌ నల్లా రాధాకృష్ణ అవార్డు ఆహ్వాన పత్రాన్ని హైదరాబాద్‌లోని సంస్థ కార్యాలయంలో సర్పంచ్‌ రూపకు అందజేశారు. రాధాకృష్ణ మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సాహిత్యాన్ని ముందుకు తీసుకుపోవడం కోసం బీఎస్‌ఏ ప్రతి ఏటా ప్రజల ఉద్యమకారులకు, సంఘ సేవకులకు, రచయితలకు, కవులకు, స్వచ్ఛంద సంస్థలకు ఈ అవార్డును అందజేస్తుందన్నారు. మార్చి 12న తిరుపతిలో నిర్వహించే బహుజన రైటర్స్‌ 6వ సౌత్‌ ఇండియా కాన్ఫరెన్స్‌లో అవార్డులు అందజేస్తామని తెలిపారు. ఆహ్వాన పత్రం అందజేసిన వారిలో బీఎస్‌ఏ రాష్ట్ర అధ్యక్షుడు ఎంఎం గౌతమ్‌, రాష్ట్ర కోఆర్డినేటర్‌ హనుమాండ్ల విష్ణు, సభ్యులు సంపత్‌కుమార్‌ ఉన్నారు.

బడికి 'ప్రైవేటు' సోలార్‌ వెలుగులు

- గతంలో తన కోటా నిధులు కేటాయిస్తున్నట్లు ప్రకటించిన ఎమ్మెల్సీలు
- కార్యరూపం దాల్చని వైనం
- ఐసీఐసీఐ ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో కొన్ని పాఠశాలల్లో ఏర్పాటు



హాసాకొత్తూర్‌ పాఠశాలలో ఐసీఐసీఐ ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో అమర్చిన సోలార్‌ పలకలు

మోర్తాడ్‌: సోలార్‌ విద్యుత్‌ సౌకర్యం కల్పించి పాఠశాలలకు విద్యుత్‌ చార్జీల బెడదను తప్పిస్తామని ప్రకటించిన ఎమ్మెల్సీల మాట నీటి మూటలైంది. సోలార్‌ విద్యుత్‌కు అవసరమైన పలకలు, బ్యాటరీ ఇతర సామగ్రి కోసం పాఠశాలలకు నిధులు కేటాయిస్తున్నట్లు ఎమ్మెల్సీలు కల్వకుంట్ల కవిత, కూర రఘోత్తంరెడ్డి చేసిన ప్రకటనలకు కార్యరూపం దాల్చలేదు. చివరకు ఐసీఐసీఐ ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో కొన్ని పాఠశాలలకు సోలార్‌ విద్యుత్‌ సౌకర్యం కల్పిస్తుండగా వాటి ద్వారా విద్యుత్‌ చార్జీల భారం తప్పనుంది. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తన కోటా నిధుల నుంచి 16 ఉన్నత పాఠశాలలకు రూ.25.60 లక్షలను మంజూరు చేస్తున్నట్లు వెల్లడించారు. ఒక్కో పాఠశాలకు రూ.1.60లక్షలతో సోలార్‌ ప్యానెళ్లు ఏర్పాటు చేసి విద్యుత్‌ సౌకర్యం కల్పించాల్సి ఉంది. అలాగే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి ఒక్కో పాఠశాలకు రూ.1.52లక్షల చొప్పున 25 పాఠశాలలకు రూ.38 లక్షలను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. రెండేళ్లు అవుతున్నా ఒక్కచోట కూడా సోలార్‌ సొబుగులు ఏర్పడక పోవడం పట్ల విద్యాభిమానులు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలల నిర్వహణకు గ్రాంటు అంతంత మాత్రంగానే ప్రభుత్వం కేటాయిస్తుంది. ఇందులో ఎక్కువ భాగం విద్యుత్‌ బిల్లులు చెల్లించడానికి సరిపోతుంది. ఇలాంటి పరిస్థితుల్లో సోలార్‌ విద్యుత్‌ను ఏర్పాటు చేస్తే పాఠశాలలపై విద్యుత్‌ బిల్లుల భారం తప్పుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. ఎమ్మెల్సీలు కవిత, రఘోత్తంరెడ్డి 2021–22 ఆర్థిక సంవత్సరానికి నిధులు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. ఇప్పుడు 2022–23 ఆర్థిక సంవత్సరం ముగింపు దశలో ఉంది. అయినా నిధుల జాడ లేక పోవడంతో సర్వత్రా నిరసన వ్యక్తమైతుంది. ఐసీఐసీఐ ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో కమ్మర్‌పల్లి మండలంలోని ఏడు పాఠశాలల్లో సోలార్‌ ప్యానెళ్లను ఏర్పాటు చేసి విద్యుత్‌ సౌకర్యం కల్పిస్తున్నారు. ప్రైవేటు సంస్థల ఆధ్వర్యంలో సోలార్‌ ఏర్పాటు అవుతున్నా ఎమ్మెల్సీల కోటా నిధులకు మోక్షం లభించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం స్పందించి పాఠశాలలపై విద్యుత్‌ బిల్లుల భారం తప్పేలా సోలార్‌ విద్యుత్‌ సౌకర్యం కల్పించాలని పలువురు కోరుతున్నారు.

ఆగని ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలు

- కాపర్‌ వైరు, ఆయిల్‌ అపహరణ
- ఆందోళన చెందుతున్న రైతులు



మాగి శివారులో దొంగలు ధ్వంసం చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌(ఫైల్‌)

నిజాంసాగర్‌: విద్యుత్‌ ట్రాన్స్‌ఫార్మర్లను టార్గెట్‌గా చేసి దొంగలు చోరీలకు పాల్పడుతున్నారు. అందులోని ఆయిల్‌, రూ.లక్షల విలువైన రాగి తీగలను ఎత్తుకెళ్తున్నారు. తాళం వేసి ఉన్న ఇళ్లు, దేవాలయాల్లో చోరీలకు పాల్పడిన దొంగలకు ట్రాన్స్‌ఫార్మర్లు సైతం ఆగడం లేదు. వ్యవసాయ బోరుమోటార్లు, పంపు సెట్లకు త్రీఫేజ్‌ విద్యుత్‌ సరఫరా కోసం ట్రాన్స్‌కో అధికారులు పంట పొలాల వద్ద ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లను దొంగలకు టార్గెట్‌ చేస్తున్నారు. బాన్సువాడ డివిజన్‌ పరిధిలోని బీర్కూర్‌ మండలంలో ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ జరిగిన మరుసటి రోజునే పిట్లం మండలం మద్దెల్‌ చెర్వు గ్రామ శివారులో ఏకంగా 6 ట్రాన్స్‌ఫార్మర్ల చోరీకి గురయ్యాయి. గతంలో నిజాంసాగర్‌ మండలం మాగి, సుల్తాన్‌నగర్‌ గ్రామాల్లోని మూడు ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం చేసిన దొంగలు సుమారు 850 లీటర్ల విలువైన ఆయిల్‌ చోరీ చేశారు. ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేస్తూ ఆయిల్‌, వైర్లను ఎత్తుకు వెళ్తుండటంతో రైతులకు కంటి మీద కునుకు లేకుండా పోతుంది. పంట ఈనే దశలో ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం చేస్తుండటంతో విద్యుత్‌ లేక పంటలు ఎండిపోతాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దొరకని దొంగలు

జిల్లాలోని మద్నూర్‌, పెద్దకొడప్‌గల్‌, పిట్లం, నిజాంసాగర్‌, బీర్కూర్‌, బిచ్కుంద, జుక్కల్‌, సదాశివనగర్‌ మండలాల్లో ట్రాన్స్‌ఫార్మర్‌ దొంగతనాలు తరుచూ జరుగుతున్నాయి. కాపర్‌ వైర్‌, సామగ్రి, ఆయిల్‌ ఎత్తుకెళ్తున్న దొంగలు పోలీసులకు చిక్కడం లేదు. గ్రామ శివారుల్లో, పంట పొలాల మధ్య ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను అర్ధరాత్రి వేళ దొంగలు ధ్వంసం చేస్తున్నారు.

నల్లమడుగులో..



ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న గ్రామస్తులు

లింగంపేట: మండలంలోని నల్లమడుగులో శనివారం రాత్రి ట్రాన్స్‌ఫార్మర్‌ నుంచి కాపర్‌ వైరు, ఆయిల్‌ దొంగిలించినట్లు ఎస్సై శంకర్‌ తెలిపారు. దొంగలు 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి అందులోని 40 కిలోల కాపర్‌ వైరు, 50 లీటర్ల ఆయిల్‌ను ఎత్తుకెళ్లారు. ఈ ఘటనపై లైన్‌మన్‌ పోలీస్‌ స్టేషన్‌లో లైన్‌మెన్‌ ఫిర్యాదు చేశారు.

రాజన్న రాజ్యం షర్మిలతోనే సాధ్యం



బోధన్‌లో వైఎస్‌ఆర్‌టీపీలో చేరిన మహిళలు



కామారెడ్డిలో..

బోధన్‌టౌన్‌: తెలంగాణలో రాజన్న సంక్షేమ పాలన వైఎస్‌ఆర్‌టీపీ రాష్ట్ర అధినేత్రి వైఎస్‌ షర్మిలతోనే సాధ్యమని జిల్లా అధ్యక్షుడు గౌతం ప్రసాద్‌ అన్నారు. ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆయన సమక్షంలో పలువురు మహిళలు పార్టీలో చేరారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నియంత పాలన సాగుతుందన్నారు. సీఎం కేసీఆర్‌ ప్రజల సంక్షేమాన్ని విస్మరించి, కుటుంబ సంక్షేమానికి పాటుపడుతున్నారని విమర్శించారు. నియోజక వర్గ కో– ఆర్డినేటర్‌ సత్యవతి, మండల అధ్యక్షుడు జగన్‌, ప్రభాకర్‌, అబ్బులు, సైదమ్మ పాల్గొన్నారు.

నియోజకవర్గ కో ఆర్డినేటర్‌గా సత్యవతి

బోధన్‌ నియోజకవర్గ వైఎస్‌ఆర్‌టీపీ కో ఆర్డినేటర్‌గా సత్యవతి నియామకం అయ్యారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన పార్టీ అధినేత్రి షర్మిలకు ఆమె ధన్యవాదాలు తెలిపారు.

వైఎస్‌ఆర్‌టీపీలో చేరికలు

కామారెడ్డి టౌన్‌: వైఎస్‌ఆర్‌ తెలంగాణ పార్టీలో ఆదివారం ముస్లిం మహిళలు చేరారు. కామారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జి, రాష్ట్ర కో– ఆర్డినేటర్‌ నీలం రమేష్‌ సమక్షంలో 38వార్డుకు చెందిన మహిళలు పార్టీలో చేరారు. నీలం రమేష్‌ మాట్లాడుతూ వైఎస్‌ షర్మిళ నాయకత్వంతో వైఎస్‌ రాజన్న రాజ్యం కోసం ఆకర్షితులై ఆయా పార్టీల నాయకులు పార్టీలో చేరుతున్నారన్నారు. జిల్లాలో పార్టీ బలోపేతానికి నాయకులు కృషి చేయాలన్నారు. నాయకులు తాహెర్‌, సుధాకర్‌, ఆస్మా, స్వామి తదితరులున్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



ధర్మారం(బి) జెడ్పీహెచ్‌ఎస్‌ 1988-89 ఎస్సెస్సీ బ్యాచ్‌ విద్యార్థులు

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి మండలం ధర్మారం(బి) గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1988–89లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం 34 ఏళ్ల తర్వాత ఒక చోట కలుసుకున్నారు. ధర్మారం(బి) శివారులోని శ్రీలత గార్డెన్స్‌లో జరిగిన ఈ ఆత్మీయ సమ్మేళనంలో అప్పుడు తమకు చదువు నేర్పిన ఉపాధ్యాయులను విద్యార్థులు ఘనంగా సన్మానించారు.



అచ్చంపేటలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

నిజాంసాగర్‌: మండలంలోని అచ్చంపేట గెస్ట్‌ హౌస్‌ వద్ద ఆదివారం 1991–92 ఎస్సెస్సీ బ్యాచ్‌ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ విద్యార్థులు చేసిన ప్రసంగాలు, నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఉపాధ్యాయులు విఠల్‌రెడ్డి, కృష్ణారెడ్డి, జయప్రకాష్‌, పూర్వ విద్యార్థులు సంతుసేట్‌, వెంకన్న, సతీష్‌, ప్రవీణ్‌ పాల్గొన్నారు.

అంబులెన్స్‌లో ప్రసవం



డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్‌): మండల కేంద్రంలో ఆదివారం ఉదయం 108 అంబులెన్స్‌లో గర్భిణి వెంకటధనలక్ష్మి కవల పిల్లలకు జన్మనిచ్చింది. అంబులెన్స్‌పైలట్‌ ఆసిఫ్‌, ఈఎంటీ సురేష్‌ తెలిపిన వివరాలు ఇలా.. మండల కేంద్రానికి చెందిన వెంకట ధనలక్ష్మికి పురిటి నొప్పులు రావడంతో ఆమె కుటుంబ సభ్యులు ఆదివారం 108కు కాల్‌ చేశారు. దీంతో ధనలక్ష్మిని తీసుకుని అంబులెన్స్‌ సిబ్బంది డిచ్‌పల్లి ప్రభుత్వ ఆస్పత్రికి బయలుదేరగా.. మార్గ మధ్యలోనే ధనలక్ష్మి ఇద్దరు ఆడపిల్లలకు జన్మనిచ్చారు. ప్రస్తుతం డిచ్‌పల్లి ఆస్పత్రిలో ఉన్న ఆమెకు ఇది రెండో కాన్పు అని, తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నారని అంబులెన్స్‌ సిబ్బంది తెలిపారు.

కోతుల దాడిపై పోలీసుల ఆరా

రామారెడ్డి: రామారెడ్డికి చెందిన చాతరబోయిన నర్సవ్వ శుక్రవారం కోతుల దాడిలో శనివారం మృతి చెందిన విషయం తెలిసిందే. ఆమె మృతిపై పోలీసులు ఆదివారం ఆరా తీశారు. ఘటనపై పోలీసులకు ఎందుకు సమాచారం ఇవ్వలేదని కుటుంబ సభ్యులను ప్రశ్నించారు. దీంతో వారు కోతులు దాడి చేస్తే పోలీసులకు సమాచారం ఇచ్చి కేసు నమోదు చేయాలని తమకు తెలియదని చెప్పారు. మృతిపై అటవీశాఖ అధికారులను వివరణ కోరాగా కోతులు దాడి చేస్తే ఎలాంటి నష్టం పరిహారం ఇవ్వరని చెప్పారు.

అవార్డుల ప్రదానోత్సవం



అవార్డు అందుకుంటున్న చిన్నికృష్ణుడు

మాక్లూర్‌: ప్రముఖ రచయిత్రి అమృతలత ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని అడవి మామిడిపల్లి శివారులో గల అపురూప కల్యాణ మండపంలో అవార్డుల ప్రదానోత్సవం కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రస్థాయిలో అమృతలత జీవన సాఫల్య పురస్కారాలను కార్టునిస్ట్‌ నృత్య రూపక కవి భీం, కథారచన, సాహితీ విమర్శకులు సింహప్రసాద్‌కు అందజేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర అధికార భాషా సంఘం అధ్యక్షురాలు ఎం శ్రీదేవి, మేడ్చల్‌ మల్కాజిగిరి అడిషనల్‌ కలెక్టర్‌ ఏనుగు నరసింహారెడ్డి హాజరయ్యారు. ఇందూరు అపురూప అవార్డులను చరిత్ర పరిశోధకులు కందకుర్తి యాదవరావు, వ్యవసాయ రంగంలో చిన్నికృష్ణుడు, కవిత్వంలో పొద్దుటూరి మాధవీలతకు అందజేశారు. రాష్ట్ర అధికార భాషా సంఘం అధ్యక్షురాలు శ్రీదేవి మాట్లాడుతూ అమృతలత చేస్తున్న సేవలను కొనియాడారు. వి రమాదేవి, ప్రభాదేవి, నరేందర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అవార్డుల ప్రదానోత్సవంలో నృత్యం చేస్తున్న విద్యార్థులు

'నా భర్త ఆత్మహత్యాయత్నానికి మా బాబాయికి సంబంధం లేదు'

నిజామాబాద్‌నాగారం: తన భర్త క్రాంతి ఆత్మహత్యాయత్నానికి తన బాబాయి ఎస్సై బాపూరావుకు సంబంధం లేదని రజిని తెలిపారు. ఆమె ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. క్రాంతి సెల్ఫీ వీడియో తీసుకొని ఆత్మహత్యాయత్నం చేసుకున్న విషయం తెలిసిందే. తన భర్త దుబాయి వెళ్లి వచ్చి డబ్బులు వృథాగా ఖర్చు చేస్తున్నారన్నారు. తన బాబాయి డబ్బులు ఖర్చు చేసుకోవద్దని చెప్పాడన్నారు.

డబ్బులు ఇవ్వడం లేదని ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న ప్రశాంత్‌

నవీపేట: మండలంలోని జన్నెపల్లి గ్రామానికి చెందిన బెజుగాం ప్రశాంత్‌ ఆదివారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. బెజుగాం ప్రశాంత్‌ అదే గ్రామానికి చెందిన సత్యనారాయణ దగ్గర రూ.30 లక్షలకు స్థలాన్ని కొనుగోలు చేసి చేసి, మూడు షట్టర్లు, ఇంటి సముదాయం తదితర నిర్మాణాలు చేపట్టాడు. కానీ ఆ స్థలం ఇరిగేషన్‌ పరిధిలోకి వస్తుందని ఇటీవల సంబంధిత అధికారులు ప్రశాంత్‌కు నోటీసులు జారీ చేశారు. దీంతో ఆవేదనకు గురైన బాధితుడు రెండు రోజుల కిందట సత్యనారాయణకు చెందిన కిరాణ దుకాణం ముందు డీజిల్‌ పోసుకుని కుటుంబ సభ్యులతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. గ్రామ పెద్దలు కల్పించుకుని రూ.ఆరు లక్షలు వాపసు ఇవ్వాల్సిందిగా చెప్పారు. కానీ సత్యనారాయణ డబ్బులను ఇచ్చేందుకు ససేమిరా అన్నారు. అప్పు చేసి నిర్మాణం చేపట్టిన ప్రశాంత్‌ మనస్తాపానికి గురై ఆదివారం మధ్యాహ్నం పురుగుల మందు తాగి మరోమారు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు నవీపేటలోని ప్రైవేటు నర్సింగ్‌హోమ్‌లో చికిత్స చేయించారు.

క్రైం కార్నర్‌

భర్త మరణం తట్టుకోలేక భార్య ఆత్మహత్య

రెంజల్‌(బోధన్‌): భర్తలేని జీవితం వ్యర్థమనుకుంది.. నెల రోజులుగా ఆయన్నే తలుచుకుంటూ నిత్యం కుమిలిపోయింది.. చివరకు భర్త వద్దకు చేరుకోవాలని నిర్ణయించుకుని గోదావరి నదిలో దూకి ఆత్మహత్య చేసుకుంది.. ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. నిజామాబాద్‌ జిల్లా రెంజల్‌ మండలం నీలా గ్రామానికి చెందిన బుర్క నర్సవ్వ(55) అనే మహిళ భర్త కిషన్‌ గతనెల 7న అనారోగ్యంతో మృతిచెందాడు. అప్పటి నుంచి మనోవేదనతో జీవితంపై విరక్తి పెంచుకుంది. ఈ నెల 2న ఇంటి నుంచి బయలుదేరి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. దీంతో కుటుంబీకులు బంధువుల ఇళ్లల్లో గాలించినా ఫలితం లేకుండా పోయింది. ఆదివారం కందకుర్తి గోదావరి నదిలో ఓ మహిళ మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. నర్సమ్మ మృతదేహమై ఉంటుందనే అనుమానంతో కుమారుడు రవికి సమాచారం ఇచ్చారు.

ఆయన అక్కడికి చేరుకుని చూడగా తన తల్లి మృతదేహంగా గుర్తించారు. రెంజల్‌ ఎస్సై పండ్ల సాయన్న జాలర్ల సాయంతో మృతదేహాన్ని బయటకు తీయించారు. కుమారుడు రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్‌లోని జిల్లా ఆస్పత్రికి తరలించారు.

వీరభద్ర ఆలయ హుండీ చోరీ



హుండీని పరిశీలిస్తున్న పూజారి

రుద్రూర్‌: రుద్రూర్‌లోని శ్రీ వీరభద్ర స్వామి ఆలయంలో శనివారం రాత్రి చోరీ జరిగింది. ఆలయంలోని హుండీ తాళాలు పగలగొట్టిన దొంగలు అందులో ఉన్న డబ్బులు ఎత్తుకెళ్లారు. ఆలయ హుండీని తరుచు దొంగలు చోరీ చేస్తుండటంతో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సీసీ కెమెరాను ఏర్పాటు చేశారు. దొంగలు సీసీ కెమెరాను తొలగించి హుండీకి పాల్పడడం గమన్హారం.

మృతురాలి గుర్తింపు

వర్ని: వర్ని శివారులోని సాగర్‌ ప్రధాన కాలలో పడి చనిపోయిన మహిళను వర్ని పోలీసులు గుర్తించారు. శనివారం సాయంత్రం కాలువలో మృతదేహం లభ్యం కాగా విచారణ చేపట్టిన పోలీసులు కోటగిరి మండల కేంద్రానికి చెందిన సోమ పోశవ్వగా గుర్తించారు. ఆదివారం ఆమె కుటుంబ సభ్యుల వద్ద ఫిర్యాదు సేకరించి మృతదేహాన్ని అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.

కాలువలో పడి ఒకరి మృతి

ఎడపల్లి: ఎడపల్లికి చెందిన అంబటి సాయిలు(48) కాలువలో స్నానం చేయడానికి వెళ్లి మృతి చెందినట్లు ఎస్సై పాండేరావు తెలిపారు. వివరాలు.. సాయిలు భార్య గతంలో చనిపోయింది. ఆయన ఓ రైతు వద్ద వ్యవసాయ పనులు చేస్తున్నాడు. ఈ నెల 3న కెనాల్‌లో స్నానం చేయడానికి వెళ్లి గల్లంతయ్యాడు. ఆదివారం మధ్యాహ్నా ఆయన మృతదేహం కాలువలో తేలింది. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆటో బోల్తా

నిజాంసాగర్‌: మండలంలోని తున్కిపల్లి గేటు వద్ద ఆదివారం ప్రయాణికులతో వెళ్తున్న ఆటో ప్రధాన రహదారిపై బోల్తా పడింది. బొగ్గగుడిసె నుంచి బాన్సువాడ వైపు వెళ్తున్న ఆటోలో నలుగురు ప్రయాణికులు ఉన్నారు. తున్కిపల్లి గేటు వద్ద డ్రైవర్‌ ఫోన్‌ చూస్తు డ్రైవ్‌ చేయడంతో ఆటో పల్టీలు కొట్టింది. ఒక ప్రయాణికురాలికి తలకు గాయమవడంతో స్పృహ తప్పింది. డ్రైవర్‌ కాలు విరగడంతో పాటు మరో ఇద్దరికి స్వల్ప గాయాలు అయ్యాయి.

జీవితంపై విరక్తితో యువకుడి ఆత్మహత్య

సిరికొండ: మండలంలోని చిన్నవాల్గోట్‌ గ్రామానికి చెందిన బొబ్బిలి సతీష్‌(28) జీవితంపై విరక్తితో ఆదివారం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై నర్సింలు తెలిపారు. యువకుడు మద్యానికి బానిసవడంతో భార్య పుట్టింటికి వెళ్లిపోయిందని ఎస్సై తెలిపారు.దీంతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఎస్సై తెలిపారు.

మతిస్థిమితం లేని ఒకరు..

మోపాల్‌: మోపాల్‌ మండలం ముదక్‌పల్లిలో కందురి నర్సయ్య(45) అనే రైతు శనివారం రాత్రి తన పొలం పక్కన ఉన్న పెద్దవాగులో చెట్టుకు ఉరివేసుకున్నాడు. ఆదివారం ఉదయం గ్రామస్తులు పంట పొలాలకు వెళ్లడంతో చూసి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. నర్సయ్య మానసిక పరిస్థితి సక్రమంగా లేకపోవడంతో ఉరి వేసుకున్నట్లు ఎస్సై మహేష్‌ తెలిపారు. మృతుడి భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

బడాపహాడ్‌లో మహిళ హత్య

వర్ని: వర్ని పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని బడాపహాడ్‌లో షహనాజ్ (38) అనే మహిళపై జలాల్పూర్‌ గ్రామానికి చెందిన వ్యక్తి కత్తితో దాడి చేసినట్లు ఎస్సై అనిల్‌ రెడ్డి తెలిపారు. వివాహేతర సంబంధం విషయంతో దాడి చేసినట్లు చెప్పారు. బాధితురాలని 108లో చికిత్స నిమిత్తం నిజామాబాద్‌ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది.

ఆర్టీసీ కాలనీలో చోరీ

మాక్లూర్‌: మాక్లూర్‌లోని ఆర్టీసీ కాలనీలో తాళం వేసిన ఇంట్లో శనివారం చోరీ జరిగింది. ఎస్సై యాదగిరిగౌడ్‌ కథనం ప్రకారం.. కాలనీకి చెందిన గూండ్ల సాగర్‌ చేపలు పడుతాడు. ఆయన భార్య జీపీ కార్యదర్శిగా పనిచేస్తోంది. శనివారం ఆమె ఉద్యోగానికి వెళ్లగా.. సాగర్‌ ఇంటికి తాళం వేసి చేపలు పట్టడానికి వెళ్లాడు. దొంగలు తాళం పగులగొట్టి ఇంట్లోకి చొరబడ్డారు. బీరువాలోని మూడు తులాల బంగారం ఎత్తుకెళ్లారు. సాగర్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

గుడిసె దగ్ధం



కాలిపోతున్న గుడిసె

ఎడపల్లి: మండలంలోని ధర్మారంలో ఆదివారం తెల్లవారుజామున షార్ట్‌ సర్క్యూట్‌తో గుడిసె దగ్ధమైంది. గ్రామానికి చెందిన అంబం పద్మకు కుమారుడితో కలిసి గుడిసెలో ఉంటుంది. తెల్లవారుజామున షార్ట్‌సర్క్యూట్‌తో గుడిసెలో మంటలు అంటుకున్నాయి. ఆ శబ్దానికి పద్మ లేచి కొడుకును తీసుకొని బయటకు వచ్చింది. దీంతో ప్రాణాపాయం తప్పింది. రూ.50 వేల ఆస్తి నష్టం జరిగినట్లు బాధితురాలు చెప్పారు.